కథ

# కొంచెం మానవత్వం

ఉషాలలిత

**టక్కున తెలివయింది లావణ్యకు. టైం ఏడు దాటుతూంది. గబగబా లేచింది. ఛీ... దరిద్రపు నిద్ర. ఎంత పడుకున్నా సరిపోదు. తనని ఎంత తిట్టుకున్నా తక్కువేననిపించింది లావణ్యకు. పాడు వెంట్రుకలు. దగ్గరకొచ్చి చావయి. మంత్రాల చింతక్కలా వున్న జుట్టును బరబరా ముడి వేసింది. పక్కనే వాళ్ళాయన ప్రకాశ్ ఏడయినా అదేదో రాత్రి రెండు గంటల మాదిరి గుర్రు పెడుతుంటే చల్లటి నీళ్ళు గుమ్మరించాలనిపించింది.**

**ఇక పిల్లలను ఒక్కక్షణం చూసింది. మగ పిల్లలు దున్నపోతులు కొట్లాడుకుంటున్నట్టు ఇద్దరు ఒకరి మీద ఒకరు కసిగా కాళ్ళు పారేసుకుని కప్పిన దుప్పట్లను కింద పడేసి అరవీర భయంకరంగా పడుకున్నారు. నిజమే వచ్చేసరికి రాత్రి అయింది. కాని పిల్లలు స్కూల్‌కు తప్పకుండా వెళ్లాలి. భర్త ఆఫీసుకూ వెళ్ళాలి.**

''ఇక లేస్తారా'' ప్రకాశ్ చెవులు చిల్లులు పడేలా ఒక్క కేక వేసింది.

''బంటీ, చిన్నా లేవండిరా''.

పిలిచిన వాళ్ళందరు ఫోజులు మార్చి పడుకున్నారే గాని కళ్ళు తెరిస్తే ఒట్టు.

''ఏవండీ మిమ్మల్నే. మీరు లేసి కాస్త వాళ్ళను లేపుతారా''.

బ్రష్ మీద పేస్టు పెట్టుకుంటూ మళ్ళీ పిలిచింది.

''ఊ'' అంటూ లేచే ప్రయత్నంలో వున్నాడు.

లావణ్య లేపితే ఎప్పుడూ ఆ పిల్లలు నిద్ర లేచింది లేదు. అదేంటో గాని లావణ్య అలా రోజు నిద్ర లేపుతూనే వుంటుంది వాళ్ళు నిద్ర లేవరని తెలిసికూడా. ప్రకాశ్ ఒక్కమాట అనగానే దిగ్గున లేచి కూర్చుంటారు అదేమోగాని.

''ఒరేయ్ దయ్యాల్లారా నేను లేపితే ఎందుకు లేవరు. డాడీ లేపితే చటుక్కున లేస్తారేమిట్రా'' అంటే.

''మమ్మీ నీ అరుపులు ఎక్కువ. కొడితే అస్సలు తాకదు. డాడీ అరవడు ఒక్కటే చుర్రుమనేలా ఇస్తాడుగా'' అన్న వాళ్ళ విశ్లేషణకు లావణ్య నోరు తెరిచింది.

యుద్ధప్రాతిపదికన అన్ని పనులు అయ్యాయనిపించింది. భర్తను ఆఫీసుకు, పిల్లలను స్కూల్‌కు పంపి, ఓ గంటలో ఇల్లంతా సర్దింది. దసరా సెలవులకని గోదావరిఖని వెళ్ళి హైదరాబాద్‌కు నిన్న అర్ధ రాత్రి దాటాక వచ్చారు. వారం రోజుల దుమ్ము దులిపింది.

ఇంట్లో పిల్లలు వున్నప్పుడు ఇల్లు దులపడం, కడగడం, తుడవడం కుదరదని వాళ్ళు వెళ్ళగానే పనులను ముందేసుకుంది. ఓ కప్ చిక్కటి టీని చేసుకుని పేపరు తెరిచింది. రెండవ పేజీలో....

సగం తాగిన కప్‌ని నిద్రలో వున్న దానిలా పక్కన పెట్టింది.

మళ్ళీ ఒక్కసారి చదివింది.

మరొక్కసారీ...

అవును ఆ అమ్మాయి... ఆ అమ్మాయ్... డౌట్ లేదు ఖచ్చితంగా... లావణ్య గుండె దడదడమని కొట్టుకోవడం, క్షణంలో మానేయడం... నిన్నటి ప్రయాణం గుర్తుకొచ్చింది.

***

గోదావరిఖని నుండి హైదరాబాద్‌కు బయలుదేరిన బస్ రాత్రి తొమ్మిది గంటలకు కరీంనగర్ చేరింది. దసరా సెలవులు అయిపోయి మళ్ళీ ఆఫీసులు, స్కూళ్ళు ప్రారంభం కావడంతో బస్టాండ్ క్రిక్కిరిసి జనంతో నిండిపోయింది. బస్ ఆగగానే బస్‌లోకి వరద నీరు వచ్చినట్టు ఎక్కుతున్నారు. కనీసం దిగేవాళ్ళను తిన్నగా దిగనీయడం లేదు. రష్... రష్...

ఎలాఎక్కిందో కాని అందరితోపాటు తులసి ఎక్కింది. అప్పటికీ జనం బాగా వున్నారని రెండు బస్‌లు ఎక్కలేదు. కాని రాత్రి అవుతోంది. ఇక తప్పలేదు. ఒక్కసారి చూసింది. కళ్ళు బైర్లు కమ్మాయి ఆ 'రష్'నీ చూసి ఎలాగో మెల్లగా కొంచెం లోపలికి రాగలిగింది.

అసలు ఆమె ఓ కాలు క్రిందనే లేదేమో

ముందు వెనకా అంతా మగవాళ్ళే అయ్యారు.

తప్పదు. ఎవ్వరినీ ఏమీ అనరాదు.

మొదటి సీట్లో నలుగురు ఆడవాళ్ళు వున్నారు ఓ చిన్నపిల్లను కలుపుకుని

రెండవ సీట్లో ముగ్గురు ఆడవాళ్ళున్నారు.

ఎలాగో వాళ్ళను చేరింది.

''ఏవండీ. కొంచెం జరగండి'' మర్యాదగా అడిగింది తులసి.

''ఎక్కడ కూర్చుంటావమ్మ. ఇది ముగ్గురు కూర్చునే సీటే''

కిటికిదగ్గర చల్లనిగాలి పీలుస్తూ కళ్ళు మూసుకుంటూ అంది ఒక తల్లి ''కొంచెం జరగండి'' తులసి మరొక్కసారి అంది.

''మా నెత్తులమీద కూర్చో'' ఇసుమంతయిన కదలకుండా విసురుగా అంది అందులో ఓ బక్క పీనుగు.

నిజానికి వాళ్ళు కొంచెం జరిగితే తులసికి కనీసంగానయిన సీటు దొరుకుతుంది. కాని వాళ్ళు అంత పెద్ద త్యాగానికి సిద్ధంగా లేదు.

వీళ్ళ సంభాషణను వింటున్న వెనక సీట్లోని మహిళ పిల్లలకు చెప్పుతూ

''మీరు సరిగ్గా కూర్చోండిరా బంటీ, చిన్నా లేకుంటే సీటు పోతుంది'' నూరిపోసింది.

ఎందుకంటే తమ వంతు వస్తుందని తెలుసు. ఎందుకంటే పిల్లలు చిన్నగా, బక్కగా వున్నారు.

ఇక తులసి ఏమీ మాట్లాడలేక పోయింది.

మూడవ సీటును చూసింది.


కిటికీ వైపు ఆడమనిషి. తర్వాత మగాయన. చిన్న పిల్లలు.

అడగాలంటే ఏదోలా వుంది. ఎందుకంటే వాళ్ళందరూ దొంగ నిద్ర నటిస్తున్నారు. కాని అనుకోకుండా ఆ పురుషుడు కళ్ళు తెరిచాడు.

''ఏవండీ. ఏమనుకోక వెనుకకు వెళ్ళగలరా. ఇది లేడీస్ సీటు కదా''

అంతే పక్కనున్న మహిళ అంతెత్తు ఎగిరింది. నిద్ర ఎటో పోయింది.

''చూడమ్మా మేం గోదావరిఖని నుండి వస్తున్నాం. ఇక్కడ నీవు ఆడవాళ్ళ సీట్లు, మగవాళ్ళ సీట్లు అంటూ హక్కుల కోసం



పోరాడనవసరం లేదు'' మూతిని ముప్ఫైఆరు వంకలు తిప్పుతూ అంది.

''అదేమిటండీ. అలా అంటారు. నేను రిక్వెస్ట్ చేస్తున్నాను. నేను వెళ్ళి వెనకాల మగవాళ్ళ పక్కన కూర్చోలేను కదా. అతనవుతే కూర్చోగలడనే అడిగాను కాని కొట్లాడడం, పోరాడడం కాదు కదా''

తులసి మాటలకు గయ్యిమంది ఆమె. ''నీవే ఆ పని చేయి. మా ఆయన కదలడు'' గట్టిగా అంది. ఆ 'ఆయన' మెల్లగా ఆమెకు మాత్రమే వినపడేలా వెనక కూర్చుంటాను అంటున్నా అతన్ని గట్టిగా గిల్లి మరీ మాట్లాడనీయలేదు. తులసికి ఎక్కడలేని నీరసం వచ్చింది.

చుట్టూ తోడేళ్లు, పులులు, రాబందులు వున్నట్లు ఫీలయింది.

తనతోపాటు మరో ముసలమ్మ పడిపోయే లాగుంది. కాని ఎవ్వరు తమని కాదన్నట్టే వున్నారు.

''టికెట్... టికెట్...'' అంటూ పద్మవ్యూహాన్ని ఛేదించుకునే అభిమన్యునిలా కండక్టర్ జన ప్రవాహంలో ఈదుకుంటూ, ఈడ్చుకుంటూ అవసరం వస్తే తిట్టుకుంటూ వస్తున్నాడు.

''లోపలికి వెళ్ళండి. లోపలికి వెళ్ళండి'' కండక్టర్ అందరిని లోపలికి తోస్తున్నాడు. ఆ తోయడంతో తులసి క్రమంగా ఆఖరి సీటు వద్దకు వచ్చింది.

''ఏవయ్యా కొంచెం జరుగు ఆ ముసలమ్మ కూర్చుంటుంది'' అంటూ ముసలమ్మని ఓ బాబు పక్కన కూర్చో పెట్టాడు కండక్టర్.

నిలుచున్న వాళ్ళలో ఒక్క తులసి మాత్రమే ఆడమనిషేమో. ఏ ఆడ మనిషికి ఆ మనిషికి కాస్త స్థలం ఇద్దాం అని ఆడవాళ్ళ సీట్లలోని ఆడవాళ్ళకుగానీ, ఆడవాళ్ళ సీట్లలో కూర్చున్న మగ వాళ్ళకు కాని లేదు.

పైన రాడ్‌ను ఒక చేత్తో, మరొక చేత్తో సీటును పట్టుకుంది. బస్ రయ్యిన పోతూంది. కండక్టర్ టికెట్లు తీసుకోగానే లైట్‌ను ఆర్పేసాడు డ్రైవర్.

ఆ చీకట్లో తులసి ప్రాణం ఉస్సూరుమంది.

చుట్టు నాగుపాములు విషపు కోరలతో చుట్టుతున్నట్టు అనిపించింది.

ఇప్పుడే ఈ ఇంటర్వ్యూ వుండాలా.

అమ్మ కంగారు పడుతూనే వుంటుంది. నిలబడి కాళ్ళు నొప్పిగా అనిపిస్తున్నాయి. ఆలోచనలతో కొట్టుకుపోతున్న తులసి భుజంపై ఏదో కదలాడింది. గట్టిగా విసిరి కొట్టింది. వెనక వున్న వాని చేయి ఏదో వెతుకుతూంది.

ఇంతలో సిద్దిపేట వచ్చింది. వెనక సీట్లో నుండి ఒకే ఒక్కతను దిగాడు. ఆ సీట్లో మరొకతను కూర్చోబోయాడు

''ఆగవయ్య ఆ అమ్మాయిని కూర్చోనివ్వు. నీవు కూర్చోవమ్మా'' ఒకతను.

మొత్తం మగవాళ్ళు. మధ్య సీటు చాలా ఇరుకుగా వుంది. అసలు కూర్చోక పోతే కాని కాళ్ళు లాగుతున్నాయి. ఎవరో తాగినట్టు వాసన. మరొకరు గుట్కా.... పక్కవాడు అదోలో చూస్తున్నాడు. ఇంతకుముందే చేయి పాకింది. మళ్ళీ లైట్ బంద్ అవుతే గుండె ధనాధనా కొట్టుకుంది.

వెనక సీట్లో కూర్చున్న వారిలో ఒకతను తులసి ఆలోచనలను పసికట్టి ''రండి మీరు కిటికీ వైపు కూర్చోండి'' అంటూ... ''కొంచెం జరగరా దండీ'' అంటూ అందరిని మొత్తానికి జరిపి తులసికి ఆఖరు సీట్లో కిటికీ దగ్గర స్థానం ఏర్పరచాడు. అంటే తన పక్కగా కొంతలో కొంత నయం అనుకుంటూ.

'థాంక్సండీ' అంటూ బహుజాగ్రత్తగా అతడికి అంటకుండా ముడుచుకుని ఎంత కూర్చున్నా 'తాకకొ' తప్పడం లేదు కొంత.

''ఎక్కడికి వెళ్ళాలమ్మా. హైదరాబాద్... సికింద్రాబాద్'' మర్యాదగా కాస్త దూరం జరుగుతూ అన్నాడు.

''హైదరాబాద్ కండీ''

''ఒక్కరేనా''

''అవునండీ! ఎప్పుడు ఒంటరిగా వెళ్ళను. కాని తప్పడం లేదు'' బాగ్‌ను దగ్గరకంటా జరుపుకుంటూ అంది.

''కాని రాత్రిళ్ళు మంచిది కాదమ్మా''

''నిజమే కాని అత్యవసరం''

మళ్ళీ టిక్కెట్లు కాగానే లైట్లు బంద్.

చల్లగాలి రివ్వున తాకగానే తులసి ముఖం విప్పారింది. చెమటతో తడిసిన ముంగురులు గాలికి అల్లనల్లిన లేచాయి. అప్పటివరకు నిల్చున్నందున కాళ్ళు, నడుం లాగుతున్నాయి. కొంచెం చిన్నగా కాళ్ళు చాపి కూర్చుంది. అలా కళ్ళు మూసుకుంది.

తండ్రి సంవత్సరం క్రితమే మరణించాడు. కార్పెంటర్‌గా పని చేసే వాడు. అతను పోయాక ఇల్లు గడవడమే కష్టమైంది. ఒక్క తమ్ముడు తప్ప ఎవ్వరూ లేరు. తులసి బి.కాం పాస్ అయ్యింది. హయ్యర్ టైపింగ్, షార్ట్‌హ్యాండ్ కూడా



పాస్ అయింది. ఉద్యోగ వేటలో పడింది. నిజానికి ఇంకా చదువుకోవాలని వున్నా బాధ్యతల కోసం, తల్లి, తమ్ముడుకోసం ఉద్యోగం చేయాలని నిశ్చయించు కుంది. ఇంటర్మీడియట్ చదువుతున్న తమ్ముడిని బాగా చదివించాలని కంకణం కట్టు కుంది. ఉద్యోగ ప్రకటన పడితే టైపిస్ట్ కోసం అప్లై చేసింది. ఈ రోజు సాయంత్రమే టెలిగ్రామ్ వచ్చింది. రేపు ఉదయం 8 గంటలకు ఇంటర్వ్యూ వుందని, హైదరాబాద్‌లో తులసి వాళ్ళ మామయ్య దోమల్‌గూడాలో వుంటాడు. పొద్దున్నే డైరెక్ట్‌గా వెళదామనుకుంటే ఏదైనా రికమండేషన్‌కు ప్రయత్నం చేద్దామని వాళ్ళ మామయ్య అనడంతో వెంటనే బయలుదేరింది. భారంగా నిట్టూర్చింది. పక్కనే వున్నతను తులసినే గమనిస్తున్నాడని మరో రెండు కళ్ళకు తప్ప ఎవ్వరికి తెలియదు.

తులసికి ఇరవై మూడేళ్ళు వుంటాయేమో. వున్నంతలో అందంగా, పొందికగా వుంటుంది. ఛామనచాయ అయినాకళగల ముఖం. కళ్ళు చిన్నవైనా అందంగా నవ్వుతాయి. సాదాసీదాగా వున్న స్వచ్ఛమైన ముత్యంలా వుంది. ఒకలాటి కుదుపుకు కళ్ళుతెరిచి చూసి మళ్ళీ తన ఆలోచనలలో పడింది గాని ఒకచేయి మెల్లగా మెడ క్రింది నుండి తన చుట్టూ బిగుసుకుంటూందని గమనించలేదు అమాయకపు తులసి. అంతే ఒక్కక్షణం... ఒకే ఒక్క నిమిషం... ఏమైందో... ఏమిటోగాని తెలియలేదు తులసి. కాని ఆ తర్వాత గాఢమైన నిద్రలోకి జారింది. తనకు తెలియకుండానే పక్కతని ఒడిలోకి వెళుతూ.

సిటీ వచ్చింది. తిరిగి లైట్ వెలిగింది.

అప్పటికి అర్ధరాత్రి అవుతూంది.

''తులసి అతని ఒళ్ళో పడుకోవడాన్ని ఒక్కళ్ళిద్దరు అదోలా చూసినా రాత్రి కనుక దిగే వాళ్ళు దిగడానికి లేచారు. మిగతా వాళ్ళు నిద్రలో జోగుతున్నారు. మరొకళ్ళను పట్టించుకునే ఆలోచనగాని, ఆసక్తిగాని ఎవ్వరికీ లేదు. దిగుతున్నారు క్రమంగా.

వెనక సీట్లోని కొన్ని కళ్ళు మాత్రం చిన్నగా మాట్లాడుకున్నాయి.

''అమ్మాయి... అమ్మాయి'' తన ఒడిలో పడుకున్న తులసిని అతడు చాలా క్లోజ్‌గా, మర్యాదగా పిలిచాడు. కాని గాఢ నిద్రలో వుంది.

''లేపవయ్యా... ఆవిడ ఎక్కడ దిగాలో'' ఎవరో అన్నారు.

''నాకు తెలుసులేవయ్యా ఆవిడ ఎక్కడ దిగాలో. మాది ఒక్కటే ఊరు. దిగేది ఇక్కడే'' జవాబులో హుందాతనం. ఒక ఊరి మంచితనం.

''ఆమెకు తలనొప్పిగా వుందని, కళ్ళు తిరుగుతున్నాయంటే నేనే పడుకోమన్నాను'' అతని గొప్ప మనసు అందరికి గొప్పగా కనిపించింది.

తులసిని జాగ్రత్తగా పట్టుకుని పక్కతను, మరొకడు తులసి బ్యాగ్ పట్టుకుని ముందుకు వస్తున్నారు.

''అరె... ఆమెకేమయ్యింది'' కండక్టర్ అలసి, సగం నిద్రలో అన్నాడు.

''పడిపోయింది సార్'' నమ్రతగా పక్కతని జవాబు.

''ఎక్కడికి తీస్కుపోతున్నావ్''.

''అదేంది సార్ మేమంతా ఒక్కూరి వాళ్ళం. మంచిగున్నది మీ ముచ్చట'' అతని సమాధానం చక్కగా వున్నది.

''నీళ్ళు కొట్టవోయ్ దిగగానే'' ఎవరిదో ఉచిత సలహా.

మూడవ సీట్లోని ఆవిడ, వాళ్ళాయన నిద్ర కళ్ళతోనే చూస్తున్నారు.

తులసి అతని భుజం మీద తలపెట్టి నడుస్తుంటే, నడుం చుట్టు అతని చేయి జాగ్రత్తగా పట్టుకుని.

ఆవిడ ఈ సీన్ చూసి కనుబొమ్మలు ఎగరేసి వాళ్ళాయన చెవిలో గుసగుస లాడింది.

''చూసారా ఎలా వుంటారో మనుషులు. ఇంకా నయం నేను మన సీట్లో కూర్చోనీయలేదు'' పెద్ద గండం గడిచినట్లు అంటే దేవుడికి గాలిలోనే దండం పెట్టి మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు 'ఆయన'.

***

తలుపు చప్పుడుకు ఉలిక్కి పడింది లావణ్య.

ఏంటీ తలుపులు వేయకుండా కూర్చున్నావు.

ప్రకాశ్ తన టేబుల్ మీద వున్న కాగితాలను వెతుకుతున్నాడు.

''ఏవండీ'' ఏడుస్తున్న లావణ్యను బిత్తరపోయి చూసాడు.

''ఏమైంది లావణ్యా'' ఆమె ఏడుపును ఆపడం తరం కావడం లేదు. నిజానికి సాయంత్రానికి గాని రాడు ప్రకాశ్. ఫైలు మరచిపోవడంతో తిరిగి వచ్చాడు.

''నేనే... నేనే... చంపాను. పాపిష్టిదాన్ని. మీరు వెనుకకు వెళ్ళి కూర్చుంటాను అన్నా నేను ఆపాను. నేనొక ఆడదాన్నేనా''.

హిస్టీరిక్‌గా మాట్లాడుతున్న లావణ్యను బిత్తరపోయి చూస్తున్నాడు ప్రకాశ్ ''చంపడం'' అనగానే షాక్ తిన్నాడు.

''ఏంటి. విషయం చెప్పి ఏడ్వు'' గట్టిగా అనగానే పేపర్ ముందు పెట్టింది.

''తాజా వార్త'' బాక్స్‌లో.

యువతి గ్యాంగ్ రేప్. హత్య! దుండగులు ఫోటోలోని అమ్మాయిని గ్యాంగ్ రేప్ చేసి, హత్య చేసి పొదల్లో పడేశారని - ఇన్వెస్టిగేషన్‌లో అమ్మాయికి క్లోరోఫాం ఇచ్చారని తేలింది.

'కొంచెం సీటివ్వరు' అనే తులసి ముఖం గుర్తుకు రాగానే ప్రపంచం గిర్రున తిరిగినట్లనిపించింది ప్రకాశ్‌కు.

అంటే! తాము చూసినప్పుడు అమ్మాయికి బస్‌లో లైట్ లేనిది చూసి క్లోరోఫాం ఇచ్చారన్న మాట. తరువాత ఆ అమ్మాయి మాకు తెలుసంటూ చెప్పి ఎక్కడికో తీసుకుపోయి...

అలాగే కూలబడిపోయాడు. ఆ హత్యలో తమకు భాగముందన్నట్టు ఆఫ్టరాల్ మూడు గంటల ప్రయాణం కోసం ఎంతటి స్వార్థం.

నిజంగానే తాను వెనక్కి వెళ్ళి కూర్చుంటే ఇంత ఘోరం జరిగేదా. మరొక్కసారి తులసి ఫోటోను చూసాడు.

''మమ్మల్ని క్షమించమ్మ'' నీళ్ళు నిండిన కళ్ళతో అర్థించాడు.

లావణ్య ఏడుస్తూనే వుంది.

'కొంచెం మానవత్వం' చూపిస్తే ఎంత బాగుండేది...

అవును... ఎంత బాగుండేది...''

★


చిరునామా

**డా. మెట్ట ఉషారాణి**

ఇంటి నెం. **4-2-140/1**, కన్నారం రోడ్డు,

పెదపల్లి - **505 172**, కరీంనగర్ జిల్లా




## డిమాండ్ తగ్గిన శ్రియ...

తెలుగులో అగ్రహీరోల అందరి సరసన నటించిన శ్రియ కోలీవుడ్‌లో కూడా తన హవా చాటుకుంది. 'శివాజీ'లో రజనీకాంత్ సరసన నటించి అందరి దృష్టిని ఒక్కసారిగా తన వైపుకు తిప్పుకున్న శ్రియకు ఇప్పుడు అవకాశాలు లేవట! దీనికి కారణం ఆమె స్వయంకృతాపరాధమే అంటున్నారు. వడివేల్ పక్కన ఓ ఐటమ్ సాంగ్‌లో నటించడం ఓ కారణం అంటున్నారు. ఐటమ్ సాంగ్ చేసినందుకు శ్రియకు భారీ మొత్తం పారితోషికం కింద ముట్టినా ఆ తరువాత అవకాశాలు మాత్రం తగ్గాయి. ఇదే కాకుండా ఆమె నటించిన మరో సినిమా 'ఎటిఎమ్' ఘోర పరాజయం పొందడంతో కోలీవుడ్‌లోని హీరోలు ఆమె సరసన నటించడానికి విముఖత చూపుతున్నారట! దీనితో అవకాశాలు లేక శ్రియ ఖాళీగా ఉంటోందట!